తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
02-10-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 234
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



# మెట్రో స్వాధీనం ఎన్నటికో?

**డిసెంబర్ 31 వరకు ఎల్అండ్‌టీ గడువు పొడిగింపు**

- పదేపదే వాయిదాల పర్వంతో ప్రభుత్వ టేకోవర్ ప్రక్రియపై నీలినీడలు
- రూ.1,461.47 కోట్ల ఈక్విటీ కొనుగోలు ఒప్పందం
- భారీ రుణభారం, రీఫైనాన్సింగ్, రెగ్యులేటరీ అనుమతుల వద్దే అసలు సమస్య
- ఏప్రిల్‌లో కుదిరిన ఒప్పందం ప్రకారం జూన్, ఆ తర్వాత సెప్టెంబర్..
- ఇప్పుడు ఏకంగా డిసెంబర్‌కు మారిన టేకోవర్ డెడ్‌లైన్

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 1 (సిరి న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును పూర్తిగా తన ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలన్న నిర్ణయానికి మళ్లీ బ్రేక్ పడింది. ప్రాజెక్టు టేకోవర్ ప్రక్రియ తరచూ వాయిదా పడుతూ వస్తోంది. ఎల్అండ్‌టీ మెట్రో రైల్ లిమిటెడ్‌లో తన మొత్తం వాటాను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కు విక్రయించే ప్రక్రియను పూర్తి చేసే గడువును ఎల్అండ్‌టీ మరోసారి పొడిగించింది. సెప్టెంబర్ 30తో ముగియాల్సిన గడువును డిసెంబర్ 31, 2026 వరకు పొడిగిస్తున్నట్లు సెప్టెంబర్ 30న స్టాక్ ఎక్స్ఛేంజీలకు అధికారికంగా సమాచారం అందించింది. దీంతో హైదరాబాద్ మెట్రో టేకోవర్ ప్రక్రియపై మళ్లీ అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒప్పందం కుదిరిన తర్వాత.. తొలుత జూన్ 30 నాటికి లావాదేవీలు పూర్తవుతాయని ప్రకటించారు. ఆ తర్వాత ఆ గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించారు. ఇప్పుడు తాజాగా దానిని డిసెంబర్ 31కి మార్చడంతో.. ఒప్పందం మిగతా 2వ పేజీలో..



## విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది..

- రికార్డులు బద్దలవుతున్నాయి
- ఇదే కొనసాగింపు అయితే రానున్నది కోతల కాలమేనా?
- సెప్టెంబర్ 30న రాష్ట్రంలో 19,892 మెగావాట్ల ఆల్ టైమ్ రికార్డు నమోదు

8



## రీల్ చూసి నకిలీ నోట్లు.. చివరకు జైలుకు!

- ఇన్‌స్టాగ్రామ్ రీల్‌తో నకిలీ కరెన్సీ తయారీకి ప్లాన్
- టెలిగ్రామ్‌లో శిక్షణ తీసుకుని ఇంట్లోనే ప్రింటింగ్
- కూరగాయల వ్యాపారి కిషన్ సోలంకిని అరెస్ట్ చేసిన పోలీసులు

8

## అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్

- రేవంత్ కేవలం చంద్రబాబు పిల్లి!
- ఇద్దరి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపండి
- యూరియా లేక రైతుల గోస
- ఆరుగంటలు కూడా కరెంట్ రావడంలేదు
- అరిగోస పడుతున్న రైతులు
- కాళేశ్వరం, ఫార్ములా రేస్ లపై వేసిన కమిషన్లు ఏం తేల్చాయి?
- మూడేళ్లయినా ఆరుగ్యారంటీలు అమలు కాలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2

## 24 గంటల కరెంట్ హామీ ఏమైంది..?

- మన రైతుల పంటలు ఎండుతుంటే.. రాజస్థాన్ కు విద్యుత్ అమ్ముకుంటారా..?
- కనీసం 7, 8 గంటలు కూడా ఇవ్వలేకపోతోంది..
- లో వోల్టేజ్ తో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయి..
- గత ప్రభుత్వ హయాంలో రోలింగ్ స్టాక్ ఉంటే..
- ఏడాదిలో 2 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్ .
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ధ్వజం
- 20 గంటల నాణ్యమైన విద్యుత్, పెండింగ్ కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్
- నంగునూరు మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన



2

## 'క్యూర్'తో హైదరాబాద్ పాలనలో కొత్త శకం

- నేటి నుంచి అధికారికంగా అమల్లోకి 'క్యూర్' చట్టం
- 1955 జీహెచ్ఎంసీ యాక్ట్‌కు బదులుగా కొత్త చట్టం
- జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎమ్ఎమ్‌సీలకు ఒకే పాలనా విధానం
- క్యాపిటల్ వాల్యూ ఆధారంగా ఆస్తిపన్ను లెక్కింపు

2



## మెట్రో.. ఆర్టీసీకి ఒకే పాస్!

- హైదరాబాద్ ప్రయాణికులకు ఉమ్మడి పాస్ విధానం
- రోజువారీ జాయింట్ పాస్ రూ.400.. నెలవారీ పాస్ రూ.8,500
- ఒకే పాస్‌తో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం
- అప్‌గ్రేడ్ చేసిన 'మీ టికెట్' యాప్ రేపు ప్రారంభం

3

## హైదరాబాద్ పోలీస్ పరిధిలో భారీ మార్పులు

- సిటీ పోలీస్ పరిధిలో 76 ప్రాంతాల సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ
- జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పరిధుల్లో మార్పులు




2



## విద్యుత్ రంగంలో మరింత అభివృద్ధి

- పాలేరు నియోజకవర్గానికి రూ.205కోట్ల నిధులు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

3



## ఎస్ఐఆర్‌కు ఇదే తుది గడువు

2

## విద్యుత్ మౌలిక వసతులలో నాణ్యతే ప్రాధాన్యం



- పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట
- తక్కువ వ్యయం, అధిక మన్నిక, పర్యావరణ హితం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు
- సీఎండీ జితేష్ వి. పాటిల్

2




# ఎస్ఐఆర్‌కు ఇదే తుది గడువు

**హైదరాబాద్, అక్టోబర్ 1:**

ఎస్ఐఆర్ ప్రక్రియకు నవంబర్ 5తో గడువు ముగుస్తుందని, ఆ తర్వాత మరోసారి పొడిగించే అవకాశం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఒకసారి గడువు పెంచినందున ఇక పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న షెడ్యూల్ ప్రకారమే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.

**92 లక్షల మందికి నోటీసులు**

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్‌లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇవ్వగా.. 65 లక్షల మంది ఇప్పటివరకు స్పందించారని సీఈవో తెలిపారు. వీరిలో 54 లక్షల మందిని తుది ఓటరు జాబితాలోకి చేర్చినట్లు వెల్లడించారు. నవంబర్ 5లోగా మిగిలిన అర్హులైన ఓటర్లను కూడా తుది జాబితాలోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

**ఇళ్ల వద్దకే బీఎల్‌వోలు**

ఇకపై హియరింగ్‌కు బదులుగా అవసరమైన పత్రాల సేకరణపైనే దృష్టి పెడతామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న వారి ఇళ్ల వద్దకే బీఎల్‌వోలు వెళ్లి పత్రాలు తీసుకుంటారని చెప్పారు. ఓటర్లను ఒకచోటకు పిలిపించకుండా నివాసాల వద్దే వివరాలు సేకరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

కుటుంబ సభ్యులందరూ హాజరు కావాల్సిన అవసరం లేదని.. ఒకరు మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు అందిస్తే సరిపోతుందని చెప్పారు. వలస వెళ్లిన ఓటర్లను పిలవాల్సిన అవసరం లేదని, ఈఆర్ఓ ఆన్‌లైన్‌లోనే వారిని సంప్రదించి ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు.

**నవంబర్ 9న తుది జాబితా**

తెలంగాణలో ఎస్ఐఆర్ ఇంకా కొనసాగుతున్నందున ఫారం6కు డిక్లరేషన్ తప్పనిసరి అని సీఈవో స్పష్టం చేశారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు అక్టోబర్ 7 వరకు గడువు ఉందన్నారు. నోటీసుల జారీ, అభ్యంతరాల పరిష్కారం నవంబర్ 5 వరకు కొనసాగుతుందని.. నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు.

**ఖైరతాబాద్‌లో 40 శాతం పూర్తి**

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు జారీ చేశామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో 40 శాతం మందిని ఇప్పటికే తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి**

రూ.2500 కోట్ల భారం పడనుంది.

కరువు పరిస్థితులు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే సుమారు 17 శాతం తక్కువ వర్షపాతంతో ముగిసిందని, రాష్ట్రంలో దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు కేబినెట్ చర్చించింది. కరువు పరిస్థితులపై చర్చించేందుకు త్వరలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రానికి తగిన సాయం కోరేందుకు త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లనుంది. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు.

**కొత్త విద్యుత్ ప్రాజెక్టులు**

ఎల్‌నినో పరిస్థితులు, ఉష్ణోగ్రతల ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ గరిష్ట డిమాండ్ రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్లకు చేరినట్లు కేబినెట్ గుర్తించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 7,800 మెగావాట్ల కొత్త విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ , 800 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి.

**మరిన్ని కీలక నిర్ణయాలు:**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, ప్రయోజనం లేని 10 అసంపూర్తి ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో డిజిటల్ మీడియా సంస్థలకు ప్రత్యేక అడ్వర్టైజింగ్ పాలసీని తీసుకురానున్నారు.

ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుతో పాటు, సమన్వయం కోసం నలుగురు గ్రూప్1 అధికారులను నియమించనున్నారు.

# హైదరాబాద్ పోలీస్ పరిధిలో భారీ మార్పులు

- **సిటీ పోలీస్ పరిధిలో 76 ప్రాంతాల సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ**
- **జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పరిధుల్లో మార్పులు**
- **ఆర్‌జీఐఏ పీఎస్ పేరు 'శంషాబాద్ పీఎస్'గా మార్పు**
- **ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ, జోనల్ సైబర్ సెల్‌ల పరిధులకూ కొత్త రూపం**

**హైదరాబాద్, అక్టోబర్ 1:**

హైదరాబాద్ మహానగరంలో శాంతిభద్రతల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు పోలీస్ వ్యవస్థను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. సిటీ పోలీస్ పరిధిలోని జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల సరిహద్దుల్లో మార్పులు చేస్తూ హోంశాఖ జీవో ఎంఎస్ నంబర్ 84ను జారీ చేసింది. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్ పరిపాలనను సరళీకరించడం, శాంతిభద్రతల పర్యవేక్షణను మెరుగుపరచడం ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

**76 ప్రాంతాల పరిధుల్లో మార్పులు**

పునర్వ్యవస్థీకరణలో భాగంగా నగరంలోని 76 ప్రాంతాలకు సంబంధించిన పోలీస్ పరిధుల్లో మార్పులు చేశారు. పలు ప్రాంతాలను ప్రస్తుతం ఉన్న జోన్లు, డివిజన్ల నుంచి ఇతర పరిధులకు బదిలీ చేశారు. సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్‌కు బదిలీ చేయడంతో పాటు మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ మార్పులు చేశారు. శంషాబాద్ డివిజన్‌లోని ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పేరును 'శంషాబాద్ పీఎస్'గా మార్చారు. రాజేంద్రనగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్‌తో పాటు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల పోలీస్ సరిహద్దుల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి.

**ప్రత్యేక విభాగాలకూ కొత్త పరిధులు**

లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లతో పాటు ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ, జోనల్ సైబర్ సెల్ విభాగాల పరిధులను కూడా ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచేలా జోన్లు, డివిజన్లను కొత్తగా వర్గీకరించారు. మహిళల భద్రతకు సంబంధించిన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు కొత్త జోన్లను కేటాయించారు. సైబర్ నేరాల కేసుల్లో వేగంగా స్పందించేలా జోనల్ సైబర్ సెల్‌ల పరిధులను కూడా సవరించారు. తాజా మార్పులతో పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# మెట్రో స్వాధీనం ఎన్నటికో?

**మొదటిపేజీ తరువాయి**

కుదిరి ఇన్ని నెలలు గడుస్తున్నా యాజమాన్య మార్పు ప్రక్రియ ఇంకా పూర్తికాలేదన్న స్పష్టత వస్తోంది.

**రూ.1,461 కోట్ల ఒప్పందం.. అసలు సమస్య ఎక్కడ?**

ఈ ఏడాది ఏప్రిల్ 29న తెలంగాణ ప్రభుత్వ సంస్థ అయిన హెచ్ఎంఆర్ఎల్, ఎల్అండ్‌టీతో షేర్ పర్చేజ్ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. ఎల్అండ్‌టీ మెట్రో రైల్ లిమిటెడ్‌లోని 100 శాతం ఈక్విటీని రూ.1,461.47 కోట్లకు కొనుగోలు చేయడానికి ఈ ఒప్పందం జరిగింది. అయితే, కేవలం వాటాల కొనుగోలు మాత్రమే కాకుండా.. సంస్థపై ఉన్న భారీ రుణభారం ఈ టేకోవర్‌లో అత్యంత కీలకమైన అంశంగా మారింది. హెచ్ఎంఆర్ఎల్ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 30 నాటికి సంస్థపై రూ.13,538.53 కోట్ల భారీ రుణం ఉంది. దాన్ని తెలంగాణ ప్రభుత్వ హామీతో రీఫైనాన్స్ చేయాలని నిర్ణయించారు. ఇది కేవలం సాధారణ కొనుగోలు కాకుండా.. వేల కోట్ల రుణం, ప్రభుత్వ హామీలు, రీఫైనాన్సింగ్, ఇతర ముగింపు షరతులతో కూడిన క్లిష్టమైన ఆర్థిక లావాదేవీ కావడంతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. తాజా గడువు పొడిగింపు ప్రకటనలో ఎల్అండ్‌టీ కొత్త తేదీని మాత్రమే వెల్లడించింది. ఈ లావాదేవీకి సంబంధించి రెగ్యులేటరీ అనుమతులు, ఇతర క్లోజింగ్ షరతులు ఇంకా పూర్తి కావాల్సి ఉందని ఎల్అండ్‌టీ తన వార్షిక నివేదికలో స్పష్టం చేసింది. మరోవైపు మెట్రో ప్రాజెక్టు గతంలో ఎదుర్కొన్న ఆర్థిక, నిర్మాణ, నియంత్రణపరమైన సమస్యలు కూడా టేకోవర్ వేగాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

**డిసెంబర్ 31 నాడైనా పూర్తవుతుందా?**

ఏప్రిల్‌లో ప్రభుత్వం మెట్రోను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంటుందని అధికారికంగా ప్రకటించినప్పటికీ.. షేర్ ట్రాన్స్‌ఫర్, లావాదేవీ ముగింపు, రుణాల రీఫైనాన్సింగ్ వంటి పూర్తి ప్రక్రియ ఇంకా ముగియలేదు. హెచ్ఎంఆర్ఎల్ అధికారిక ప్రకటనలో ఇది 100 శాతం ఈక్విటీ కొనుగోలు ఒప్పందంగా పేర్కొన్నప్పటికీ, టేకోవర్ నిర్ణయం జరిగింది కానీ టేకోవర్ పూర్తయిందా లేదా అనేది ఇప్పటికీ సందిగ్ధంగానే ఉంది. కనీసం డిసెంబర్ 31 నాడైనా ఈ ప్రక్రియ పూర్తవుతుందా? లేక మరోసారి గడువు పొడిగింపు తప్పదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే ఫేజ్ 1ను తన ఆధీనంలోకి తీసుకుని, భవిష్యత్ మెట్రో విస్తరణతో అనుసంధానించాలనే లక్ష్యాన్ని ప్రకటించింది. అయితే, టేకోవర్ ప్రక్రియే పదేపదే వాయిదా పడుతుండటంతో.. ఫేజ్ 1 ఆస్తులు, రుణాలు, నిర్వహణ బాధ్యతలు, పూర్తి ఆర్థిక భారంపై స్పష్టమైన తుది రూపం ఎప్పుడు వస్తుందన్నది ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్

**హైదరాబాద్, , అక్టబోర్ 1:**

తెలంగాణలో రైతులు, చేనేత కార్మికులు, యువత, బీసీలు, దళితులు, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) అన్నారు.ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం నాడు తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతలు గోస పడుతున్నారని తెలిపారు. ఆరు గంటలు కూడా కరెంట్ రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, రైతుబంధు రావడం లేదని, యూరియా దొరకడం లేదని కంటతడి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఫోన్ చేస్తే యూరియా పొలం వద్దకే వచ్చేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.

**సిటీగైడ్స్ చూడండి**

ప్రజలు తమ పక్షాన నిలబడి ఈ ప్రభుత్వంపై పోరాడాలని కోరుతున్నారని చెప్పారు. కేసీఆర్ ఆనాడే చెప్పారు.. మోసపోకండి.. మోసపోతే గోసపడ్తం అని. ఇవాళ అన్నివర్గాల ప్రజలు గోసపడుతున్నరు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ రైతులను ఇబ్బంది పెట్టిందని, అదే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి "వెనకటి రోజులు మళ్లీ తెస్తా" అని చెప్పారని, ఇప్పుడు సాగునీరు లేని రోజులు, కరెంట్ రాని రోజులు తిరిగి తెచ్చారని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు మోసం చేసేవాళ్లనే నమ్ముతారని రేవంత్ రెడ్డి గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు నిజమయ్యాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిందని అన్నారు. కాళేశ్వరం మీద కమిషన్ వేశారని, విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ వేశారని, ఫార్ములాఈ వ్యవహారంపై కేసులు పెట్టారని, బ్యాంకు ఖాతాల వ్యవహారాలపై విచారణ జరిపారని, అయితే వీటి నుంచి ఏమి తేల్చారని ప్రశ్నించారు. ప్రజల మనసు ఖాళీగా ఉంటే కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలు గుర్తుకొస్తాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం కొత్త అంశాలను తెరపైకి తెస్తోందని ఆరోపించారు.

సిరిసిల్ల పర్యటనలో ముఖ్యమంత్రి చేనేత కార్మికుల సమస్యలపై సమాధానం చెప్పకుండా వెళ్లారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్లలో పలువురు చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, విద్యార్థుల స్కూల్ యూనిఫాం ఆర్డర్లు నిలిచిపోయాయని, నేతన్న బీమా పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. చనిపోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు పరిహారం ప్రకటిస్తారని, నేతన్న బీమాపై ప్రకటన చేస్తారని ఆశించినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు.ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటనను జరిపిన తీరుపై కేటీఆర్ ఫైర్ అయ్యారు.. భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి పర్యటించడం ప్రజల మధ్య పర్యటనలా లేదని విమర్శించారు. "నల్లమల పులి అని చెప్పుకుంటడు.. నాలుగు వేల మంది పోలీసులను పెట్టుకుని పోతాడా? నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు పిల్లి" అని విమర్శించారు. ముఖ్యమంత్రి చుట్టూ పోలీసులు తప్ప ప్రజలు కనిపించలేదని, బీఆర్ఎస్ నాయకులను ముందుగానే అరెస్టు చేసి, దుకాణాలు మూసివేయించారని ఆరోపించారు.ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సంబంధించిన వ్యాపారాలు, టెండర్లు, భూముల వ్యవహారాలపై కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కంపెనీకి అర్హత లేకపోయినా భారీ విలువైన టెండర్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు.కొండల్ రెడ్డి అర్హతలు, ఏరోస్పేస్ రంగంలో ఆయనకు వచ్చిన అవకాశాలపై కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిన్నటి వరకు పెద్దగా ఆస్తులు లేని కుటుంబ సభ్యులు వేల కోట్ల పెట్టుబడులు ఎలా పెడుతున్నారని ప్రశ్నించినందుకే ముఖ్యమంత్రికి కోపం వస్తోందని అన్నారు.

తన ఆస్తులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కేసీఆర్ 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రి, డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రిగా పనిచేశారని, నాలుగు దశాబ్దాలకు పైగా చట్టసభల్లో ఉన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ తనను చిన్నప్పటి నుంచి బాగా చదువుకోవాలని చెప్పే

# 24 గంటల కరెంట్ హామీ ఏమైంది..?

- **కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ధ్వజం**
- **20 గంటల నాణ్యమైన విద్యుత్, పెండింగ్ కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్**
- **నంగునూరు మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన**

**హైదరాబాద్, , అక్టోబర్ 1 :**

మన రాష్ట్రంలో రైతులకు కరెంట్ సక్రమంగా లేక పంటలు ఎండుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రాజస్థాన్‌కు సింగరేణి విద్యుత్ అమ్ముకుంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. గురువారం ఆయన నంగునూరు మండలంలోని పాలమాకుల, అక్కనేపల్లి, అంక్షాపూర్ గ్రామాలలో పర్యటించారు. అనంతరం నర్మెట సబ్ స్టేషన్ ను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై మీడియాతో మాట్లాడారు.. పాలమాకుల, అక్కనేపల్లి, అంక్షాపూర్ గ్రామాలలో రైతులను నేరుగా కలిసిన సమయంలో ప్రతీ రైతు విద్యుత్ లో వోల్టేజ్తో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని ఫిర్యాదు చేశారన్నారు. ఈ పరిస్థితిని తెలుసుకునేందుకు సంబంధిత నర్మెట సబ్ స్టేషన్ కు వెళ్లి పరిశీలించగా ఏ రోజూ రైతులకు 10 గంటల కరెంటు రావడం లేదని, కేవలం 7 నుంచి 8 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా వస్తున్నట్లు తెలిసిందన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో 22 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తుంటే గగ్గోలు పెట్టి విమర్శ చేసిన కాంగ్రెస్ వాళ్లు నేడు అందులో సగం గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. అంక్షాపూర్ లో ఓ యువ రైతు తన ఎనిమిది ఎకరాల పొలం కరెంటు లేక ఎండిపోతోందని తన గోడును వెళ్లబుచ్చాడన్నారు. పాలమాకులలో మూడు రోజుల క్రితం ట్రాన్స్ ఫార్మర్ కాలిపోతే ఇప్పటికీ ఇవ్వలేదు, కరెంటు లేక పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. అంతే కాకుండా నంగునూరులో 3, గట్లమల్యాలలో 2 ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయి మూడు రోజులైనా కొత్తవి ఇవ్వడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒక్క మండలంలోనే వారంలో 41 ట్రాన్స్ ఫార్మర్లు, 100 నుంచి 200 మోటార్లు కాలిపోయినట్లు రైతులు తెలిపారని అన్నారు. దానికి కారణం ఏమిటని తెలుసుకోగా సబ్ స్టేషన్లో లోవోల్టేజీ సమస్య గుర్తించామన్నారు. ఈ నాసిరకం లో వోల్టేజ్ కరెంటు వల్లే రైతుల మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్లు కాలిపోవడం వల్ల రైతులకు దనపు భారం, ఆర్థిక భారం పడుతోందన్నారు. ఇది పూర్తిగా చేతగాని ప్రభుత్వం, ఈ ప్రభుత్వ వైఫల్యానికి ఇది నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి ఎందుకు దీనిపై రివ్యూ చేయడం లేదని ప్రశ్నించారు.

మన రాష్ట్రంలో కరెంటు లేదు కానీ..సింగరేణిలో ఉత్పత్తి అవుతున్న 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు అమ్ముతామని జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ ఎందుకు చేసుకున్నారు అని ప్రశ్నించారు. మీరు చెప్పిందేమో 24 గంటల కరెంటు, కానీ ఇస్తున్నది కేవలం తొమ్మిది గంటలే. అందులోనూ మధ్యమధ్యలో ట్రిప్ అవుతోంది. మెటీరియల్ లేదనే సాకుతో రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సంవత్సర కాలంగా పెండింగ్ లో పెట్టారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏ నెల కనెక్షన్లు ఆ నెలకే రిలీజ్ చేసే వాళ్లం. అప్పుడు 4,500 రూపాయలు ఉన్న డీడీ చార్జీలను ఈ కాంగ్రెస్ వాళ్లు 9,000 రూపాయలకు పెంచారు. అయినా డీడీలు కట్టిన రైతులకు కనెక్షన్లు ఇవ్వకుండా ఎదురుచూపులు చూసేలా చేస్తున్నారు.

మూడు రోజులు ట్రాన్స్ ఫార్మర్ లేకపోతే రైతుల పంటలు ఏమవ్వాలి? మీ ఇంటెలిజెన్స్ కు ఇవేవీ కనబడటం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి గాలిలో తిరిగితే రైతుల సమస్యలు ఎట్లా తెలుస్తాయి.. నేల మీదకు వచ్చి రైతుల దగ్గరకు వస్తే వాస్తవాలు తెలుస్తాయి. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండి నీరు కిందికి జారడం లేదు. కాబట్టి లోవోల్టేజ్ లేకుండా రాత్రి పూట కలుపుకుని కనీసం 20 గంటల కరెంటును రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# విద్యుత్ మౌలిక వసతులలో నాణ్యతే ప్రాధాన్యం

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధిలో నాణ్యత, సుస్థిరత మరియు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆధునిక, సహజ నిర్మాణ పద్ధతులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హబ్సిగూడ సర్కిల్ కాప్రా డివిజన్‌లో దమ్మాయిగూడ వద్ద ప్రతిపాదిత 33/11 కేవీ హైబ్రిడ్ సబ్‌స్టేషన్‌కు నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ పనులను ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంప్రదాయ నిర్మాణ విధానాలకు ప్రత్యామ్నాయంగా అమలు చేస్తున్న సహజ నిర్మాణ సాంకేతికతలను అధికారులతో కలిసి చర్చించారు. నిర్మాణ రంగంలో పర్యావరణ హిత పద్ధతులను అనుసరించడం కాలానుగుణ అవసరమని సీఎండీ అన్నారు. స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించడం ద్వారా నిర్మాణ వ్యయాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణంపై ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలోనూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు టీజీఎస్పీడీసీఎల్ ఇటువంటి వినూత్న విధానాలను అమలు చేస్తోందన్నారు.



ప్రస్తుతం కాంపౌండ్ వాల్ నిర్మాణంలో పౌర్డ్ ఎర్త్, ర్యామ్డ్ ఎర్త్ మరియు ఇంటర్‌లాకింగ్ బ్లాక్స్ అనే మూడు సహజ నిర్మాణ పద్ధతులను అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. స్థానిక మట్టి, సున్నం, జీజీబీఎస్, మెటల్ మరియు ఎంసాండ్ వంటి పదార్థాలను వినియోగించడం ద్వారా నిర్మాణాలు మరింత బలంగా, పర్యావరణానికి అనుకూలంగా మారుతాయి. టీజీఎస్పీడీసీఎల్‌లో ఈ సాంకేతికతను తొలిసారిగా ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సంప్రదాయ ఇటుక నిర్మాణాలతో పోలిస్తే సుమారు 20 నుంచి 30 శాతం వరకు నిర్మాణ వ్యయం తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. సహజ నిర్మాణ పద్ధతుల ప్రధాన ప్రయోజనం వాటి దీర్ఘకాలిక మన్నిక, తక్కువ నిర్వహణ వ్యయం మరియు అధిక స్థిరత్వం అని సీఎండీ పేర్కొన్నారు. ముఖ్యంగా సున్నం ఆధారిత నిర్మాణ పదార్థాలు కాలక్రమేణా మరింత బలపడే స్వభావం కలిగి ఉండటంతో నిర్మాణాల జీవితకాలం పెరుగుతుందని చెప్పారు. ఈ పద్ధతులు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు అనుకూలమైన నిర్మాణ వ్యవస్థలను అందిస్తాయని వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం మన్నే, పర్యావరణానికి మేలు చేసే నిర్మాణాలే భవిష్యత్తు అని జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో డైరెక్టర్ (కమర్షియల్) సి. చక్రపాణి, మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్) పి.వి. రమేష్, హబ్సిగూడ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. వెంకన్న, సూపరింటెండింగ్ ఇంజనీర్ (సివిల్) వి. రవికాంత్ రెడ్డి, సైనిక్‌పురి డివిజనల్ ఇంజనీర్ అన్వర్ పాషా మొహమ్మద్, ఏడీఈ టి. రాజశేఖర్, సివిల్ ఏఈ పి. బాలరాం తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ‘క్యూర్’తో హైదరాబాద్ పాలనలో కొత్త శకం

- నేటి నుంచి అధికారికంగా అమల్లోకి ‘క్యూర్’ చట్టం
- 1955 జీహెచ్ఎంసీ యాక్ట్‌కు బదులుగా కొత్త చట్టం
- జీహెచ్ఎంసీ, సీఎమ్‌సీ, ఎమ్ఎమ్‌సీలకు ఒకే పాలనా విధానం
- క్యాపిటల్ వాల్యూ ఆధారంగా ఆస్తిపన్ను లెక్కింపు • ఆస్తి, నీరు, సీవరేజ్, శానిటేషన్ సేవలకు ఇంటిగ్రేటెడ్ బిల్లింగ్
- హైడ్రాకు చట్టబద్ధ హోదాతో ఆక్రమణలపై మరిన్ని అధికారాలు

హైదరాబాద్, అక్టోబర్ 1:

హైదరాబాద్ మహానగర పాలనలో కీలక మార్పులకు దారితీసే ‘క్యూర్’ (CURE) చట్టం రేపటి నుంచి అమల్లోకి రానుంది. 1955 నాటి జీహెచ్ఎంసీ యాక్ట్ స్థానంలో తీసుకొచ్చిన ఈ చట్టంతో జీహెచ్ఎంసీ, సీఎమ్‌సీ, ఎమ్ఎమ్‌సీ పరిధులకు సమగ్ర పాలనా విధానం అమలులోకి రానుంది. విలీన ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్నులు, పాలనా విధానాల్లోని వ్యత్యాసాలను తొలగించి మూడు కార్పొరేషన్లలోనూ ఒకే విధమైన నిబంధనలు అమలు చేయనున్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఏకీకృత విధానం అందుబాటులోకి రానుంది.




**క్యాపిటల్ వాల్యూపై ఆస్తిపన్ను**

క్యూర్ చట్టంతో ఆస్తిపన్ను విధానంలోనూ మార్పు రానుంది. ప్రస్తుతం ఉన్న రెంటల్ వాల్యూ విధానానికి బదులుగా ఆస్తి క్యాపిటల్ వాల్యూ ఆధారంగా పన్ను లెక్కించనున్నారు. కొత్త విధానం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయనుండటంతో ఆస్తిపన్ను పెరిగే అవకాశం ఉంది. ప్రతి ఆస్తికి ప్రత్యేక ‘ఇంటిగ్రేటెడ్ ఐడెంటిటీ కోడ్’ కేటాయించనున్నారు. ఆస్తి పన్ను, తాగునీరు, సీవరేజ్, శానిటేషన్ చార్జీలను ఒకే పోర్టల్ ద్వారా సమగ్ర బిల్లింగ్ విధానంలో అందించనున్నారు. ట్రాఫిక్, విపత్తుల నిర్వహణ కోసం ప్రత్యేక అథారిటీల ఏర్పాటుకూ చట్టంలో మార్గం కల్పించారు.

**హైడ్రాకు చట్టబద్ధ హోదా**

చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు, ఇతర ప్రజా ఆస్తుల పరిరక్షణకు పని చేస్తున్న హైడ్రాకు క్యూర్ చట్టం ద్వారా చట్టబద్ధ హోదా కల్పించనున్నారు. ఆక్రమణల నిరోధం, అక్రమ నిర్మాణాలపై చర్యలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాకు మరిన్ని చట్టపరమైన అధికారాలు అందనున్నాయి. దీంతో నగరంలోని పబ్లిక్ అసెట్స్ రక్షణలో హైడ్రా పాత్ర మరింత విస్తరించనుంది.

# విద్యుత్ రంగంలో మరింత అభివృద్ధి

ఖమ్మం, , అక్టోబర్ 1 :

పాలేరు నియోజకవర్గం (Palair constituency)లో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు గత 34 నెలల్లో రూ. 205 కోట్ల నిధులు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం ఏదులాపురం మున్సి పాలిటీ పరిధిలోని తరుణి హాట్ లో కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ తో కలిసి డివిజన్ ఈఆర్ఓ కార్యాలయాన్ని మంత్రి ప్రా రంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొం గు లేటి మాట్లాడుతూ.. పాలేరు నియోజక వర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, హైటె న్షన్ విద్యుత్ వైర్ల మార్పిడి, కొత్త విద్యుత్ లై న్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పా టు వంటి పనులకు రూ. 205 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. చేపట్టిన పనుల్లో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతిపక్ష నాయకులు విద్యుత్ రంగంపై తప్పుడు ప్రచారం చేస్తు న్నారని మంత్రి అన్నారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, తమ ప్రభుత్వం వాటిని పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిందని తెలి పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి అధిక వ్యయం జరిగిన అంశాలను సరిదిద్దుతూ విద్యుత్ రం గంలో సంస్కరణలు చేపడుతున్నామని చెప్పా రు. తెలంగాణ విద్యుత్ రంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. భవిష్యత్ వి ద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఎన్ పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్ రావు, వి ద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీని వాస రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారు లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 20 వేల ఓట్లు వెంటనే చేర్చాలి: దానం నాగేందర్

- ఖైరతాబాద్‌లో ఓట్ల తొలగింపుపై మాజీ మంత్రి తీవ్ర ఆగ్రహం
- తొలగించిన ఓట్లను అదనపు జాబితాలో చేర్చాలని డిమాండ్
- బీజేపీతో కుమ్మక్కై ‘ఓట్ చోరీ’కి పాల్పడుతున్నారని ఆరోపణ
- బాధ్యులైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఓటు హక్కు పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగుతాయని వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 1:

“ఖైరతాబాద్ నియోజకవర్గంలో దాదాపు 20 వేల ఓట్లను అన్యాయంగా తొలగించారు.. వాటన్నింటినీ వెంటనే ఓటర్ల జాబితాలో చేర్చాలి” అని ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ డిమాండ్ చేశారు. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చకపోతే నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చుతాయని హెచ్చరించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**బీజేపీతో కుమ్మక్కై ఓట్ చోరీ: దానం**

హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తున ‘ఓట్ చోరీ’ జరుగుతోందని దానం నాగేందర్ ఆరోపించారు. ప్రజలను ఈ పరిణామాల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కొంతమంది అధికారులు బీజేపీ నాయకులతో కుమ్మక్కై వారి ఆదేశాల మేరకు ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 2000, 2002 నుంచి నివాసముంటూ, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగించుకున్న నిజమైన ఓటర్ల పేర్లను ఇప్పుడు కావాలనే జాబితా నుంచి తొలగించారని అన్నారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**



నిజమైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న అధికారులపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని దానం నాగేందర్ డిమాండ్ చేశారు. అర్హులైన పౌరులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఇప్పటివరకు తొలగించిన 20 వేల ఓట్లను అదనపు జాబితా ద్వారా తిరిగి చేర్చి ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు.



# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.2 కోట్ల చేయూత

హైదరాబాద్, అక్టోబరు 1:

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (Young India Police School) నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని డిజిపి సి.వి.ఆనంద్ అన్నారు. విద్య కోసం అందించే సహాయం సమాజంపై శాశ్వత ప్రభావం చూపుతుందని, దాని ప్రయోజనాలు భవిష్యత్ తరాలకు కూడా అందుతాయని పేర్కొన్నారు. మంచిరేవులలోని వైఐపీఎస్ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ఎంవైకే లాటిక్రెట్ (ఎంవైకే ఫౌండేషన్) రూ.2 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) లో భాగంగా ఈ విరాళాన్ని అందించింది. ఎంవైకే లాటిక్రెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ మురళీ యాదమ గురువారం డిజిపి కార్యాలయంలో సి.వి. ఆనంద్‌కు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన అవకాశాలు కల్పించడమే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ లక్ష్యమన్నారు. విద్యా సంస్థల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు, ఇతర భాగస్వాములు అందిస్తున్న సహకారం ప్రాజెక్టుకు మరింత బలాన్నిస్తుందని చెప్పారు. విద్యారంగానికి ఇచ్చే విరాళం, చేయూత ఎప్పటికీ విలువైనదేనని, సమాజ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుందని డిజిపి పేర్కొన్నారు.



# అక్టోబర్‌లోనూ ఎండలే!

- తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం
- ఈ నెలలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా ఉండే సూచనలు
- ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు
- అక్టోబర్-డిసెంబర్‌లోనూ తక్కువ వర్షపాతమే ఉండొచ్చన్న ఐఎండీ
- ఈశాన్య రుతుపవనాల సమయంలో తటస్థ ఐఓడీ పరిస్థితులు కొనసాగే అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 1:

తెలంగాణలో అక్టోబర్ నెలలోనూ వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశం లేదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నెలవారీ వాతావరణ అంచనాలను విడుదల చేసిన ఐఎండీ.. రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నట్లు తెలిపింది. సాధారణంగా అక్టోబర్‌లో వాతావరణం క్రమంగా చల్లబడాల్సి ఉండగా, ఈసారి అందుకు భిన్నంగా ఎండల తీవ్రత కొనసాగే అవకాశముందని పేర్కొంది.

**ఎల్‌నినో ప్రభావం**

భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంపై కొనసాగుతున్న బలమైన ఎల్‌నినో పరిస్థితులు వాతావరణంపై ప్రభావం చూపుతున్నట్లు ఐఎండీ తెలిపింది. ఈ పరిస్థితులు ఏడాది చివరి వరకు మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు హిందూ మహాసముద్రంపై ప్రస్తుతం ఐఓడీ తటస్థ స్థితిలో ఉందని, రాబోయే ఈశాన్య రుతుపవనాల సమయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని అంచనా వేసింది.

**మూడు నెలలూ తక్కువ వర్షా లే?**

అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగే సీజన్‌లో తెలంగాణలో మొత్తం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని తెలిపింది. దీంతో అక్టోబర్‌లోనూ వేడి వాతావరణం కొనసాగవచ్చని పేర్కొంది.

# ఇన్ సర్వీస్ టీచర్లకు టీజీ టెట్–2026-II

- ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ
- అక్టోబర్ 7 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల ఉపాధ్యాయులకు అవకాశం
- గురుకులాలు, మోడల్ స్కూళ్ల టీచర్లకు కూడా అర్హత
- నవంబర్ 16 నుంచి 21 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 1:




తెలంగాణలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ శుభవార్త అందించింది. విధుల్లో ఉన్న టీచర్ల కోసం ప్రత్యేకంగా టీజీ టెట్-2026II నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థల పరిధిలోని బడులతో పాటు టీజీఆర్‌ఈఐఎస్, ప్రభుత్వ సంక్షేమ గురుకుల సొసైటీలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఈ ప్రత్యేక టెట్ రాసే అవకాశం కల్పించారు.

**అక్టోబర్ 7 నుంచి దరఖాస్తులు**

టీజీ టెట్-2026IIకి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ అక్టోబర్ 7న ప్రారంభం కానుంది. అర్హులైన ఉపాధ్యాయులు అక్టోబర్ 16 వరకు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్షకు సంబంధించిన ఇతర పూర్తి వివరాలను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

**నవంబర్ 16 నుంచి పరీక్షలు**

దరఖాస్తు చేసుకున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నవంబర్ 16 నుంచి 21 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో టెట్ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. నిర్ణీత గడువులో అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికకు తాత్కాలిక బ్రేక్

- విజయారెడ్డి పిటిషన్‌పై తుది తీర్పు వచ్చేవరకు నోటిఫికేషన్ ఇవ్వబోమన్న ఈసీఐ
- తెలంగాణ హైకోర్టుకు వెల్లడించిన భారత ఎన్నికల సంఘం
- దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానం
- తదుపరి విచారణపై ఉప ఎన్నిక భవితవ్యం

హైదరాబాద్, అక్టోబర్ 1:

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ప్రకటన చేసింది. కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై తుది పరిష్కారం లభించే వరకు ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయబోమని తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణపై న్యాయస్థానం విచారణ పూర్తయ్యే వరకు అనిశ్చితి నెలకొంది.

**దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ**

బీఆర్ఎస్ తరపున గెలిచి, అనంతరం కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ అనర్హతకు గురైన నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ కార్యదర్శి ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఖాళీ ఏర్పడిన ఆరు నెలల్లో ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం ఈ వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించింది.

**విజయారెడ్డి పిటిషన్‌పై నిర్ణయం కీలకం**

గత అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు విచారణలో ఉంది. ఈ పిటిషన్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకూడదని ఈసీఐ నిర్ణయించింది. ఈ విషయాన్ని న్యాయస్థానానికి వెల్లడించింది. తదుపరి విచారణలో హైకోర్టు వెలువరించే ఆదేశాల ఆధారంగా ఉప ఎన్నిక నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# మెట్రో.. ఆర్టీసీకి ఒకే పాస్!

- హైదరాబాద్ ప్రయాణికులకు ఉమ్మడి పాస్ విధానం
- రోజువారీ జాయింట్ పాస్ రూ.400.. నెలవారీ పాస్ రూ.8,500
- ఒకే పాస్‌తో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం
- అప్‌గ్రేడ్ చేసిన ‘మీ టికెట్’ యాప్ రేపు ప్రారంభం
- మొబైల్ నుంచే బస్ టికెట్లు, డే పాస్, వార, నెలవారీ పాస్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 1:

హైదరాబాద్ నగర ప్రజా రవాణాలో ప్రభుత్వం కీలక మార్పు తీసుకొచ్చింది. ఇక మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ఒకే పాస్‌తో ప్రయాణించే అవకాశం కల్పిస్తూ ‘కామన్ పాస్’ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అప్‌గ్రేడ్ చేసిన ‘మీ టికెట్’ మొబైల్ యాప్‌తో ఈ సేవలను మరింత సులభతరం చేయనున్నారు. ఉమ్మడి పాస్ విధానాన్ని రేపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభించనున్నారు.

**రూ.400 నుంచి జాయింట్ పాస్**

మెట్రో, ఆర్టీసీ సేవలను అనుసంధానిస్తూ రోజువారీ, నెలవారీ జాయింట్ పాస్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రోజువారీ పాస్ ధరను రూ.400గా, నెలవారీ పాస్‌ను రూ.8,500గా నిర్ణయించారు. ఈ పాస్ ఉన్న ప్రయాణికులు రెండు రవాణా వ్యవస్థల్లోనూ ప్రయాణించవచ్చు. ఉద్యోగులు, వ్యాపారులు, నగరంలోని వివిధ ప్రాంతాలకు ప్రతిరోజూ రాకపోకలు సాగించే వారికి ఈ విధానం ఉపయోగపడనుంది.



**మొబైల్‌లోనే టికెట్**

ఆర్టీసీ బస్సుల్లోనూ డిజిటల్ టికెటింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. కండక్టర్ నుంచి పేపర్ టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా ప్రయాణికులు మొబైల్ ద్వారానే టికెట్ పొందే సదుపాయం కల్పించారు. అప్‌గ్రేడ్ చేసిన ‘మీ టికెట్’ యాప్‌లో రోజువారీ టికెట్లు, డే పాస్‌లతో పాటు వారంరోజుల పాస్, నెలవారీ బస్ పాస్‌లను కూడా కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. నగర ప్రజా రవాణాను మరింత వేగవంతంగా, సులభతరం చేసే దిశగా ఈ డిజిటల్ సేవలను తీసుకొచ్చారు.

# విద్యుత్ సమస్యలపై బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్న మోహన్ రెడ్డి



**కొంపల్లి.అక్టోబర్.01(సిరి న్యూస్).**

కొంపల్లి సర్కిల్ 288వ డివిజన్ కొంపల్లిలోని నెలకొన్న విద్యుత్ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఆదిరెడ్డి మోహన్ రెడ్డి విద్యుత్ అధికారి ఏఈ శ్రీనివాస్. ఫోర్ మెన్ అధికారి శ్రీనివాస్ లైన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణలతో కలిసి పరిశీలించారు.కొంపల్లిలోని బొౖడాయి వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద కావలసిన మరమ్మతులను చేసారు.ఈ బస్తీబాట కార్యక్రమంలో విద్యుత్ అధికారులతో పాటు పార్టీ నాయకులు ఆంజనేయులు ముదిరాజ్ ఎడమ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బుల్డోజర్ డ్రామా బురిడీ సీన్



- **మేడలు వదిలేసి పెంట్ హౌస్లపై ప్రతాపం**
- **అమీన్పూర్ లో చైన్ మెన్ల సుత్తి నాటకాలు**

**అమీన్పూర్ అక్టోబర్ 1 సిరి న్యూస్**

అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంగా మారుతుంది. అసలైన అక్రమాలు రోడ్డుపైనే, కిష్టారెడ్డిపేట్ బీరంగూడ ప్రధాన రహదారిని ఆనుకొని వెలిసిన భారీ అక్రమ కట్టడాలు బహుళ అంతస్తుల భవనాలు స్పష్టంగా కనిపిస్తున్న చైన్ మెన్లు వాటి జోలికి వెళ్లడం లేదు. కంటి తుడుపు కూల్చివేతలు అధికారుల కళ్ళకు గంతలు కట్టేందుకు పబ్లిక్ సిటీ కోసం ఎక్కడో జన సంచారం లేని మూలల్లో ఉన్న చిన్న షెడ్లు ,కనపడని ప్రహరి గోడలను, పెంట్ హౌస్లను కూల్చివేసి డిమాలేషన్ డ్రైవ్ పూర్తి చేశామని నాటకాలు ఆడుతున్నారు. అధికారులకు తప్పుడు నివేదికలు, క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో వెళ్లే ఔట్ సోర్సింగ్ చైన్ మెన్లు ఉన్నతాధికారులకు వాస్తవాలను దాచి తప్పుడు సమాచారం ఇస్తూ అక్రమాలకు సహకరిస్తున్నారు. కాలనీవాసుల అగ్రహం, జిహెచ్ఎంసి నిధులకు ప్లానింగ్ నిబంధనలకు గండి కొడుతున్న చైన్ మేన్ల అరాచకాలపై ఉన్నతాధికారులు స్వయంగా తనిఖీలు చేసి భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడిగా నాయికోటి రాములు





**పెద్ద శంకరం పేట , అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

పెద్ద శంకరం పేట మండల పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడిగా బద్దారం ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ నాయికోటి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రెండేళ్ల కాలానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కిషోర్, అసోసియేట్ అధ్యక్షుడిగా వై. సంతోష్కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను రేగోడ్ మండల సంఘం బాధ్యులు అంజిబాబు, నాయక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**సదాశివపేట. అక్టోబర్ 1. (సిరిన్యూస్)**

ఎమ్మెల్సీ అంజిరెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లగూడెం గ్రామానికి చెందిన మారేపల్లి స్వప్నకు బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ వారికి తోడుగా, అండగా ఉంటాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సదాశివపేట మండల పార్టీ అధ్యక్షుడు కర్ణం ఆదిత్య, మండల ప్రధాన కార్యదర్శి ఉక్కిస భరత్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, సుభాష్, సాకేత్ పాల్గొన్నారు.

# గీతంలో ఫార్మసీ వారోత్సవాలు..

# పాఠశాలలో స్వచ్ఛతా కార్యక్రమం..






- **విద్యార్థుల్లో అవగాహన, సామాజిక బాధ్యత పెంపొందించేలా కార్యక్రమాలు**

**పటాన్ చెరు, అక్టోబర్ 01 (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం జాతీయ ఫార్మసీ వారోత్సవాలు-2026, స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాంటీమైక్రోబయల్ నిరోధకతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టగా, ఎన్సీసీ క్యాడెట్లు రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామూహిక పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా ఫార్మా క్విజ్, శాస్త్రీయ పోస్టర్ ప్రదర్శన, డిజిటల్ రీల్స్ తయారీ, వీధి నాటకం, సైన్స్ కార్టూన్లు, కరపత్రాల రూపకల్పన వంటి పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం, భావప్రసార నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. మరోవైపు, 'ఒక గంట.. అంతా కలిసి' నినాదంతో రుద్రారం పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో ఎన్సీసీ క్యాడెట్లు, సిబ్బంది పాల్గొన్నారు. పరిశుభ్రత, పౌర బాధ్యత, సామాజిక భాగస్వామ్యంపై విద్యార్థులు, స్థానికులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కార్యక్రమాన్ని అభినందించగా, గీతం ఎన్సీసీ యూనిట్ సమన్వయకర్త లెఫ్టినెంట్ అజయ్ కుమార్, క్రీడా విభాగం కోచ్లు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంతో పాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంపై బాధ్యతను పెంపొందించాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# వేద సంస్కృతి పరిరక్షణలో బ్రాహ్మణుల పాత్ర కీలకం

- **చతుర్వేద సదస్సులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**




**పటాన్చెరు, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, వేద సంప్రదాయాల పరిరక్షణలో బ్రాహ్మణ సమాజం కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. హైదరాబాద్లోని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ భవనంలో తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్తక సభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు-10వ చతుర్వేద సదస్సులో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. వేదాలు, శాస్త్రాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షిస్తూ సమాజానికి మార్గనిర్దేశం చేస్తున్న పండితుల సేవలు అభినందనీయమన్నారు. నైతిక విలువలు, ఆధ్యాత్మిక చైతన్యం, సాంస్కృతిక వారసత్వం బలోపేతానికి వేద సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, పేదలకు ప్రభుత్వ పథకాలతోపాటు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వాసుదేవరావు, చంద్రశేఖర్ జోషి, వామనభట్ల ప్రకాశ శర్మ, వేద పండితులు, సంక్షేమ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముందస్తు పరీక్షలతో ఆరోగ్య రక్షణ

- **గుండె, క్యాన్సర్పై ఉచిత స్క్రీనింగ్**
- **నిజాంపేటలో**
- **లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం.**
- **హాజరైన డీజీపీఓ ఎస్పీ నర్సింహారెడ్డి**

**రామాయంపేట, (నిజాంపేట)అక్టోబరు 1 (సిరి న్యూస్):**



గుండె, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందేందుకు ముందస్తు వైద్య పరీక్షలు ఎంతో అవసరమని డీజీపీఓ ఎస్పీ నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వంజరి సంఘం భవనంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రామాయంపేట ఆధ్వర్యంలో సింధు, మల్లారెడ్డి హాస్పిటల్స్ వైద్య బృందం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత గుండె, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్య లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే సకాలంలో వైద్య చికిత్స అందించడంతోపాటు ఆరోగ్య సమస్యలను నియంత్రించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో సింధు, మల్లారెడ్డి హాస్పిటల్స్కు చెందిన వైద్య బృందం ప్రజలకు గుండె, క్యాన్సర్కు సంబంధించిన పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్యులు తగిన సూచనలు, సలహాలు అందించారు. మండల ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిడీ తిరుపతి గౌడ్, జిల్లా కార్యదర్శి, రామాయంపేట మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దేమే యాదగిరి, జిల్లా మాజీ గవర్నర్ టీవీపీ చారి, రామాయంపేట సీఐ సైదా నాయక్, నిజాంపేట ఎస్సై రాజేష్, సర్పంచ్ నరేందర్, లయన్స్ క్లబ్ సభ్యులు, సింధు, మల్లారెడ్డి హాస్పిటల్స్ వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ భూములు కాపాడుకుందాం.. గ్రామస్తులు భాగస్వాములు కావాలి





**మెదక్, అక్టోబర్ 1 సిరి న్యూస్**

అటవీ భూములను కాపాడుకోవడంలో గ్రామస్తులు భాగస్వాములు కావాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హిమాచందన పిలుపునిచ్చారు. అడవులు అటవీ భూములు భవిష్యత్ తరాలకు అందాల్సిన సహజ సంపద అని వాటి పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆమె అన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం గ్రామంలో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఫారెస్ట్పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అటవీ భూముల ప్రాధాన్యత అడవుల పరిరక్షణ అక్రమ ఆక్రమణలు చెట్ల నరికివేత తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. అటవీ భూములు ఆక్రమణలకు గురికాకుండా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని హిమాచందన సూచించారు. ఎక్కడైనా అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరిగినా చెట్లను అక్రమంగా నరికివేసినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అటవీ భూములను ఆక్రమించడం అడవి సంపదకు నష్టం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. అడవులు ఉండటం వల్ల పర్యావరణ సమతుల్యతతో పాటు వర్షపాతం భూగర్భ జలాల సంరక్షణకు కూడా ఎంతో

ప్రయోజనం ఉంటుందని అధికారులు వివరించారు. అటవీ సంపదను కేవలం ఫారెస్ట్ శాఖ మాత్రమే కాపాడటం సాధ్యం కాదని ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించినప్పుడే అటవీ భూములకు రక్షణ ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో అటవీ భూముల పరిరక్షణపై అవగాహన పెంచుతూ ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అటవీ భూములు చెట్లను రక్షించడం ద్వారా రాబోయే తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హిమాచందనతో పాటు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ శారద, గ్రా మ పెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అటవీ భూముల పరిరక్షణకు తమవంతు సహకారం అందిస్తామని గ్రామస్తులు తెలిపారు.

# గర్భిణీల ఆరోగ్యమే శిశువు ఆరోగ్యానికి పునాది

- సొంత నిధులతో గర్భిణీ మహిళలకు చీరల పంపిణీ చేసిన వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య



**గుమ్మడిదల, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

గర్భిణీ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని గుమ్మడిదల మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య సూచించారు. గర్భిణీ మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తన సొంత నిధులతో గర్భిణీ మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిమ్ముల సంధ్య మాట్లాడుతూ గర్భధారణ సమయంలో మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. తల్లి ఆరోగ్యం బాగుంటేనే శిశువు ఆరోగ్యంగా జన్మించే అవకాశం ఉంటుందని, అందువల్ల గర్భిణీ దశ నుంచే సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు అవసరమైన మందులు, పోషకాహారాన్ని సకాలంలో తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ మహిళలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గర్భిణీలకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సూచనలు అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గర్భిణీ మహిళల ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గర్భిణీ మహిళలకు అండగా నిలిచి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలనే ఉద్దేశంతో తన వంతు సహాయంగా సొంత నిధులతో చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి డా. మధుకర్, అంగన్వాడీ సూపర్వైజర్ కవిత, వార్డు కౌన్సిలర్ ఆకుల మాధవి, కత్తుల రమేష్, అంగన్వాడీ టీచర్లు పోచమ్మ, శైలజ, పుష్ప, మంగమ్మ, గిరిజ, ఏఎన్ఎం స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం





- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

చిన్నారులు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయవచ్చని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పోషకాహార వారోత్సవాలు, శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు సాంప్రదాయబద్ధంగా శ్రీమంతాల వేడుక నిర్వహించగా, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు అవసరమైన పోషకాలు అందిస్తే శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడి ఆరోగ్యకరమైన తరాన్ని తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గర్భిణీ దశ నుంచే మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లి తీసుకునే ఆహారం తల్లి ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. గర్భిణులు సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులకు ఎదుగుదల దశలో అవసరమైన పోషకాలు అందేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు చేరువ చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల చిన్నారుల ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున, తల్లిదండ్రులు పిల్లల ఆహారపు అలవాట్లపై దృష్టి సారించాలని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను చిన్ననాటి నుంచే పెంపొందించడం ద్వారా భవిష్యత్‌లో అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్, అంగన్వాడీ సూపర్‌వైజర్ కవిత, వార్డు కౌన్సిలర్ ఆకుల మాధవి, కత్తుల రమేష్, అంగన్వాడీ టీచర్లు పోచమ్మ, శైలజ, పుష్ప, మంగమ్మ, గిరిజ, ఏఎన్ఎం స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు





**పెద్ద శంకరం పేట, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు హామీల కమిటీ చైర్మన్ డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం పెద్ద శంకరం పేటలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీ మరింత సులభతరం కావడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. అర్హులు రేషన్ కార్డుల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

**మౌలిక వసతులకు ప్రాధాన్యం**

అనంతరం కొత్తపేటలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, మహిళా సమైక్య భవనాన్ని ప్రారంభించారు. నారాయణపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన ప్రహరీ గోడను, రామోజీపల్లిలో మహిళా సమైక్య భవనాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ అక్టోబర్, 01(సిరి న్యూస్)**

రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి గృహ నిర్మాణ శాఖ,రెవెన్యూ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రెండవ విడతలో ఇంకా మిగిలి ఉన్న అర్హత గల ఇందిరమ్మ గృహ నిర్మాణాలలో సరైన లబ్ధిదారులను గుర్తించి, లబ్ధిదారుల దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలన్నారు. మొదటి విడతలో మంజూరై నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసి లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా సంబంధిత ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు.ప్రతి నియోజవర్గానికి 1500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో గుడిసెలు, రేకుల ఇండ్లు, మట్టితో ఉన్న వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, తాహసిల్దార్లు, హౌసింగ్ ఏ ఈ, డి ఈ లు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలపై గళమెత్తుదాం

- - సంగారెడ్డి ఆందోళనకు పటాన్‌చెరు నుంచి భారీగా తరలిరావాలి
- - టియుడబ్ల్యూజె-ఐజెయు పటాన్‌చెరు అధ్యక్షుడు పత్తి నర్సింహ



**పటాన్‌చెరు, అక్టోబర్ 01 (సిరి న్యూస్):**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజెఐజెయు) ఆధ్వర్యంలో అక్టోబర్ 2న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఆందోళనకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నర్సింహ, ప్రధాన కార్యదర్శి కొండకల్లు యాదగిరి పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రత, అక్రిడిటేషన్ తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని వారు కోరారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఆందోళనను విజయవంతం చేయడంలో ప్రతి జర్నలిస్టు భాగస్వామి కావాలని పత్తి నర్సింహ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు ఐక్యంగా సంగారెడ్డి జిల్లా కేంద్రానికి తరలిరావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి నేతృత్వంలో జరిగే నిరసనలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్ పాల్గొంటారని తెలిపారు.

# సర్ నోటీసులతో కంగారు వద్దు



**నర్సాపూర్ అక్టోబర్ 01 (సిరి న్యూస్)**

సర్ (SIR) రెండవ విడత స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం నర్సాపూర్ మండలంలో రుస్తుంపేట, నాగులపల్లి మూసపేట బి ఎల్ ఎ 2 బూత్ అధ్యక్షులు,మండల బీజేపీ నాయకులతో కలిసి బూత్ లలో పర్యటించి నూతన ఓటర్ల నమోదు (ఫారం 6),డూప్లికేట్ / డబుల్ ఓట్ల తొలగింపు (ఫారం 7),ఓటు షిఫ్టింగ్ (ఫారం 8) నోటీసుల పై కంగారు పడుతున్నారని కావలిసిన పత్రాలు ఇచ్చి సరిచేసుకోవాలి అని ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా SIR మెదక్ జిల్లా ఇన్చార్జ్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.వీరితో పాటు నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నగేష్ మండల ఉపాధ్యక్షులు సంజీవ రెడ్డి బూత్ అధ్యక్షులు శ్రీనివాస్, మహేష్,మహేందర్ ,శ్రీకాంత్, బాలు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రాథమిక విద్యే విద్యార్థికి బలమైన పునాది



- ఎఫ్ఎల్ఎన్‌పై సమీక్షా సమావేశం
- మండల విద్యాధికారి వేణుశేఖర్

**పెద్ద శంకరం పేట, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

విద్యార్థుల అభ్యసనలో ప్రాథమిక స్థాయి విద్య అత్యంత కీలకమని మండల విద్యాధికారి వేణుశేఖర్ అన్నారు. గురువారం మండల వనరుల కేంద్రంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఎఫ్ఎల్ఎన్ (పునాది అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాలు)పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలు, విద్యార్థుల ప్రగతి, అభ్యసన లోపాలను సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు అకడమిక్ సహకారం అందిస్తూ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని వేణుశేఖర్ తెలిపారు.

# ప్లాట్ల కేటాయింపు వేగవంతం చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, అక్టోబర్ ఉదండపూర్**

రిజర్వాయర్ నిర్వాసితుల ఆర్అండ్ఆర్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. దాదాపు 99 శాతం భూసేకరణ అవార్డులు పూర్తయ్యాయని తెలిపారు.సర్పంచులు గ్రామసభలు నిర్వహించి ప్లాట్ల కేటాయింపును వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్ సమస్యలపై ప్రతి 15 రోజులకు సమీక్షనిర్వహిస్తామని చెప్పారు.ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, వచ్చే 15 రోజుల్లో సాధ్యమైనంత వరకు పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని లిపారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు స్థానం కల్పించాలి

- **జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మెట్టు గంగారం డిమాండ్.**



**రామాయంపేట, అక్టోబర్ 1 (సిరి న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో 2027 మార్చ్ లో ఖాళీ అవుతున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ రెండిటికి రెండు అగ్రకులాలకు ఇవ్వడం* బీసీలను అవమాన పరచడమే అవుతుందని మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మెట్టు గంగారం తెలిపారు గురువారం నాడు ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పెద్దలు పునరాలోచన చేసి కనీసం ఒక్కటైనా బీసీలకు ఇవ్వాలని సూచించారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పడం జరుగుతుందని, కానీ రాష్ట్రంలో మాత్రం ఇలా అవమానపరచడం ఏమాత్రం సహించరానిది అన్నారు. కాంగ్రెస్ పార్టీ కులగనణ అంటూ చేశారు.మరో పక్క సామాజిక న్యాయం అంటూనే అగ్ర కులాలకు పెద్దపీట వేస్తున్నారు. ఇదేం పద్ధతి అని గంగారం ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీలు మెజారిటీ సంఖ్యలో ఉన్నందున ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వకపోవడం సరి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్సీ స్థానాలపై పునరాలోచన చేసి బీసీలకు ఇవ్వాలని, లేనియెడల కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, హెచ్చరించారు. తాము అగ్ర కులాలకు వ్యతిరేకం కాదు గాని ప్రగతిశీల లౌకిక భావాలు కలిగిన వారికి అవకాశం కల్పిస్తే స్వాగతిస్తం అన్నారు.

# విబేధాలతో బగ్గుమన్న కల్లు గొడవ !!!

**శివ్వంపేట అక్టోబర్1 ((సిరి న్యూస్ ):**

గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా కల్లు, మద్యం విక్రయ షాపులను ఏర్పాటుచేసి గ్రామంలో గొడవ లు చేస్తూ, ఆందోళనకరంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూన్నారు. అక్రమ దుకాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గ్రామస్థులు గురువారం నర్సాపూర్ లోని ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ కలిసి ఫిర్యాదు చేశారు. అయితే గ్రామంలో గత కొన్ని రోజులుగా కల్లు దుకాణంలో నిత్యం గొడవలు జరుగుతున్నాయని కల్లు విక్రయించవద్దని కొందరు, ఒక కల్లు దుకాణం ఉండగా మరో దుకాణం ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ఇలా ఏర్పాటు చేయవద్దని ఇరువర్గాల వారు ఒక దుకాణం పై మరో దుకాణం వారు గొడవలు దిగుతూ, పెట్టెలు ఎగిరేస్తూ సిసలు పగలగొడుతున్నారని చెప్పారు. గురువారం ఒక దుకాణంలోకి లోకి చొరబడిన ఇతర వర్గానికి చెందిన వ్యక్తులు కల్లు పెట్టెలు ఎగరేస్తూ, సీసాలను పగలగొట్టారని, గ్రామస్తులు తెలిపారు.



**మద్యం విక్రయ షాపులపై గ్రామం లో లొల్లి**

ఉమ్మడి మెదక్ జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ శివారులో ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద అక్రమంగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ షాపులపై గ్రామంలో లొల్లులు జరుగుతున్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం దేవాలయ ఆవరణలో కొందరు వ్యక్తులు కిరాణా షాపుల పేరిట డబ్బా దుకాణాల ఏర్పాటు చేసి అందులో మద్యం డంప్ లను పెట్టి, అక్కడికి వచ్చే భక్తులకు జోరుగా మద్యం విక్రయాలను కొనసాగిస్తున్నారని తాగిన మైకంలో కొందరు వర్గాల వారీగా గొడవలకు దిగుతుండగా మరికొందరు చోరీలకు పాల్పడుతున్నారని ఇటీవల దేవాలయంలో దొంగతనం జరిగి పెద్ద ఎత్తున స్వామి వారి అభరణాలు చోరీకి గురయ్యాయన్నారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత చెడు కార్యకలాపాలు జరుగుతున్నాయని తక్షణమే దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి అక్కడి నుంచి డబ్బాలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. రెండు మూడు డబ్బాలకు నిర్ణీత స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని అనుమతులు ఇవ్వగా వారు ఏకంగా వందలాది గజాలలో పెద్ద ఎత్తున షట్టర్లను ఏర్పాటు చేసి అటు కల్లు తో పాటు ప్రతి షాప్ వారు మద్యం ను విక్రయిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నత అధికారులు, అలాగే ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే డబ్బాలను తొలగించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని గ్రామస్తులు యువకులు హెచ్చరించారు. గురువారం గ్రామానికి చెందిన కొంతమంది సంగారెడ్డి లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ కలిసి మద్యం విక్రయాలపై, డబ్బాలను తొలగించాలని, ఆలయంలో జరిగే చోరీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు

- **లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల మంజూరు ప్రక్రియపై సమీక్ష**

**గుమ్మడిదల, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ సూచించారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు, అన్నారం వార్డులకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్లపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చైర్మన్ కుమార్ గౌడ్, సంబంధిత అధికారులు, వార్డు కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారుల వివరాలు, అర్హతలు, ఇళ్ల మంజూరు ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన వారికి ఇళ్ల మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేద కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు మంజూరయ్యేలా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల వివరాల పరిశీలనలో ఏవైనా లోపాలు లేదా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి నిబంధనల మేరకు పరిష్కరించాలని అధికారులు సూచించారు. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, ఇందిరమ్మ ఇళ్ల ఏఈ అనూష, వార్డు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ఆయా ప్రాంతాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వైద్య సంస్థల్లో భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి




- **రోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ అక్టోబర్,01(సిరి న్యూస్)**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థలు వైద్య సంస్థల చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఆసుపత్రుల్లో రోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, అగ్ని ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు తదితర అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య సంస్థల చట్టం అమలు, అగ్ని ప్రమాదాల నివారణ, రోగులను భద్రత ఉంచాలన్నారు. నివాస అవసరాల కోసం నిర్మించిన భవనాల్లో నిర్వహిస్తున్న ఆసుపత్రులను ప్రత్యేకంగా పరిశీలించి, ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు, అగ్ని ప్రమాదాల నివారణ ఏర్పాట్లు, అత్యవసర సేవలు, విద్యుత్ భద్రత తదితర సదుపాయాలు నిబంధనల మేరకు ఉన్నాయా లేదా నిర్ధారించాలని ఆదేశించారు. నిబంధనల అమలుపై సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో రైతుల ప్రాణాలకు ముప్పు

- **ఆపరేటర్ కరెంట్ లైన్ ఆన్ చేయడంతో నలుగురు రైతులకు స్వల్ప గాయాలు**
- **వరిగుంతం సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన..**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**కొల్చారం, అక్టోబర్ 01 (సిరి న్యూస్)**

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో నలుగురు రైతులు ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్న ఘటన కొల్చారం మండలం వరిగుంతం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ రైతుల ప్రాణాలతో చెలగాటం ఆడుతారా అంటూ సీతారాం తండా రైతులు గురువారం వరిగుంతం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. బాధిత రైతుల వివరాల ప్రకారం.. సీతారాం తండాలోని సేవాలాల్ గుడి వద్ద ఉన్న వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సుమారు 15 రోజుల క్రితం చెడిపోయింది. దీంతో మరమ్మతులు చేయాలని రైతులు లైన్‌మెన్ బాల్యను కోరారు. బుధవారం మధ్యాహ్నం బాలయ్య వరిగుంతం సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీశైలంకు ఫోన్ చేసి సమాచారం అందించి, ఎల్సి (లైన్ క్లియర్) తీసుకున్న అనంతరం మరమ్మతు పనులు చేపట్టారు. లైన్‌మెన్‌తో పాటు మరో నలుగురు రైతులు విద్యుత్ స్తంభం ఎక్కారు. అయితే ఆపరేటర్ శ్రీశైలం ఒక్కసారిగా విద్యుత్ లైన్‌ను ఆన్ చేయడంతో స్తంభంపై ఉన్న రైతులకు ప్రమాదం ఏర్పడింది. అప్పటికే లైన్‌మెన్ బాల్య స్తంభం దిగివచ్చారు. విద్యుత్ ప్రవాహం రావడంతో ఓ రైతుకు స్వల్పంగా షాక్ తగలడంతో గట్టిగా అరుస్తూ స్తంభంపై నుంచి కిందకు దూకాడు. అప్రమత్తమైన మిగతా ముగ్గురు రైతులు కూడా వెంటనే కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. స్తంభంపై నుంచి కిందకు దూకడంతో రైతులు రమావత్ రాజు, బాల్‌సింగ్, రెడ్యా, నందులకు స్వల్ప గాయాలయ్యాయి. ఒక్కసారిగా జరిగిన ఘటనతో వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తోటి రైతులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరగా ఉన్నది అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ హైమద్ అలీ తెలిపారు.

# స్వచ్ఛతే లక్ష్యం...కైతలాపూర్ లో (సీఎంసి) సిబ్బంది శ్రమదానం



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

స్వచ్ఛతా హి సేవా-2026లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో ఖైతలాపూర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో శ్రమదానం నిర్వహించారు. సీఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్), కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ తదితర అధికారులు, పారిశుధ్య కార్మికులు, వాలంటీర్లు కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛమైన నగర నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# గచ్చిబౌలిలో విదేశీ మహిళల వ్యభిచార దందా

- **డ్రీమ్ ఫైడ్ హోటల్‌పై ఏహెచ్‌టీయూ, పోలీసుల సంయుక్త దాడి**
- **పోలీసుల అదుపులో ఆరుగురు మహిళలునగదు,సెల్‌ఫోన్లు స్వాధీనం**

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 1(సిరి న్యూస్):**




గచ్చిబౌలిలోని డ్రీమ్ ఫైడ్ హోటల్‌ను అడ్డాగా చేసుకుని విదేశీ మహిళలతో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం అందడంతో గచ్చిబౌలి పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) అధికారులు సంయుక్తంగా హోటల్‌పై దాడి చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నిఖిల్, రామ్మోహన్‌రెడ్డితో పాటు విటుడు హర్షిత్ సింఘానియాను అదుపులోకి తీసుకున్నారు. వ్యభిచార కార్యకలాపాల్లో ఉన్న ముగ్గురు విదేశీ మహిళలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిర్వాహకుడిగా గుర్తించిన నిఖిల్ ఢిల్లీకి చెందినవాడిగా విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు.హోటల్‌లోని వేర్వేరు గదులను వ్యభిచార కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. పట్టుబడిన మహిళలు ఉజ్బెకిస్తాన్‌కు చెందినవారని, ఇటీవలే హైదరాబాద్‌కు వచ్చినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దాడిలో 23 ఉపయోగించిన కండోమ్‌లు, రూ.13 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహిళల పాస్‌పోర్టులు, వీసాలు చెల్లుబాటులోనే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా? మహిళలను నగరానికి ఎలా తీసుకువచ్చారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# గూడు చెదరకుండా చూడండి

**కాజీపేట, సెప్టెంబర్ 1**

వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు ప్రభుత్వం న్యాయం చేయాలని, 22 ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న పేదలకు పట్టాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ నగర్ వీకర్ సెక్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుస్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పసనూరి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పేదల హక్కులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అంకుస్, పసనూరి మనోహర్ మాట్లాడుతూ వైఎస్సార్ నగర్‌లో సుమారు 22 ఏళ్లుగా వందలాది పేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం వారికి ఆధార్, రేషన్, ఓటరు గుర్తింపు కార్డులతో పాటు ఇంటి నంబర్లు, బ్యాంకు ఖాతాలు తదితర గుర్తింపు సదుపాయాలు కల్పించిందన్నారు. సర్వే నంబర్లు 69, 70, 71, 72, 73 పరిధిలోని భూమిలో పేదలు ఏళ్లుగా నివసిస్తున్నారని తెలిపారు. గత కొన్ని నెలలుగా కొందరు భూమిపై కన్నేసి గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పేదల నివాసాలను తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ వైపు అడుగులు-

# బీఆర్ఎస్ నుంచి భారీగా చేరికలు

- **కాంగ్రెస్ వైపు అడుగులు.. బీఆర్ఎస్ నుంచి భారీగా చేరికలు**
- **కాంగ్రెస్‌లోకి 20 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు**

**హనుమకొండ, అక్టోబర్ 1**

స్టేషన్ ఘనపూర్ మండలం అక్కపల్లిగూడెం గ్రామానికి చెందిన సుమారు 20 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు యార కొమురెల్లి ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య నివాసంలో ఈ చేరికలు జరిగాయి. ఎంపీ కడియం కావ్య వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. పార్టీలోకి జరుగుతున్న చేరికలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, అందరం కలిసి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. , అనుముల అశోక్, బొమ్మగాళ్ల అఖిల్, బొమ్మగాళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో మెదక్ నియోజకవర్గం





- **రూ.7.04 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.**
- **ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం.**
- **మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.**

**మెదక్ అక్టోబర్,01(సిరి న్యూస్)**

మెదక్ పట్టణంలో వివిధ వార్డుల్లో మొత్తం ₹7.04 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు గురువారం శంకుస్థాపనలు చేశారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, స్లాబ్‌లు, ప్రధాన చౌరస్తాల అభివృద్ధి వంటి పనులను చేపట్టనున్నారు.ఈ అభివృద్ధి పనులతో పట్టణంలోని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మరింత మెరుగుపడటంతో పాటు ప్రధాన చౌరస్తాలు అభివృద్ధి చెందనున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, మున్సిపల్ అధికారులు,వార్డు కౌన్సిలర్స్,కో ఆప్షన్ సభ్యులు,పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జులు,టౌన్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, మైనారిటీ టౌన్ అధ్యక్షుడు మహ్మద్ ఫాజిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల ఘర్షణ..

- **రెసిడెన్షియల్ క్రమశిక్షణ గాడి తప్పిందా..**
- **ప్రిన్సిపల్ శంకర్ నాయక్ , ఉపాధ్యాయుల నిర్లక్ష్యం...**

**హత్నూర, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

హత్నూర మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని ఎం ఎస్ పి జిల్లా కార్యదర్శి గందగళ్ల ప్రసాద్ మాదిగ, ఎం ఆర్ పి ఎస్ సీనియర్ నాయకులు వల్లోల్ల మొగులయ్య ఆరోపించారు. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో ఇంటర్, పదో తరగతి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగి, ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడి చే



సుకోవడంతో గాయపడినట్లు తెలిపారు. గత నెలలో కూడా విద్యార్థులు అంబేద్కర్ కళాశాలకు వెళ్లి అక్కడి విద్యార్థులతో గొడవపడిన ఘటనను బయటకు రాకుండా ప్రిన్సిపల్ శంకర్ నాయక్ ప్రయత్నించారని ఆరోపించారు. సుమారు 4 వందల మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో పర్యవేక్షణ లోపించిందని, విద్యార్థులు తరచూ రోడ్లపై తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యను ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లగా (మీ ఊరిలో గొడవలు జరగవా) అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారని తెలిపారు. విద్యార్థుల భద్రతపై అధికారులు వెంటనే దృష్టి సారించి, పాఠశాలలో క్రమశిక్షణ, పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# రూఫ్‌టాప్ సోలార్‌పై అవగాహన సదస్సులు

- **అక్టోబర్ 2 నుంచి 4 వరకు మెదక్‌లో ప్రత్యేక కార్యక్రమాలు**

**మెదక్, అక్టోబర్ 1 సిరి న్యూస్**

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా గృహాలపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెదక్‌లోని ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెదక్ పాత బస్టాండ్ సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో జరిగే ఈ అవగాహన కార్యక్రమంలో రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకోవాలనుకునే గృహ వినియోగదారులకు పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు అందించనున్నారు. పథకం ద్వారా లభించే ప్రయోజనాలు, దరఖాస్తు చేసుకునే విధానం, ప్రభుత్వం అందించే సబ్సిడీ బ్యాంకుల ద్వారా లభించే ఆర్థిక సహాయం, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, తదితర అంశాలపై వినియోగదారులకు అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా సేవా సేతు క్యాంపులు, సీఎస్‌సీ కేంద్రాల ద్వారా కూడా ఈ కార్యక్రమాలకు సంబంధించిన సేవలు, సమాచారం అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుపై ఆసక్తి ఉన్న గృహ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవగాహన కార్యక్రమాలకు హాజరై పథకం వివరాలను తెలుసుకోవాలని సూచించారు.






# మందమర్రిపై పోలీస్ నజర్!..





- **మందమర్రి స్టేషన్‌లో వార్షిక తనిఖీ..**
- **నేరస్థులపై నిరంతర నిఘా..**
- **మాదకద్రవ్యాల నియంత్రణకు ఆదేశాలు..**
- **పెండింగ్ కేసులపై కీలక ఆదేశాలు..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (సిరి న్యూస్)**

సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన మందమర్రిలో నేర నియంత్రణకు పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలకు సిద్ధమైంది. దొంగతనాలు, మాదకద్రవ్యాల కట్టడి, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మందమర్రి పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించి, నేర నియంత్రణ, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీకి మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, మందమర్రి ఎస్‌ఐ నరేష్ మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కేంద్రం, రికార్డులు, సిబ్బంది బ్యారక్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మందమర్రి పరిధిలో నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, చరిత్ర కలిగిన నేరస్థుల కదలికలు, గస్తీ, నేర నియంత్రణ చర్యలపై ఎస్‌ఐ నరేష్‌ను సీపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కేసులు నమోదైన వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, అవసరమైతే నిబంధనల ప్రకారం ముఠా ఫైళ్లు ప్రారంభించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కావడంతో దొంగతనాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ స్పష్టం చేశారు. మందమర్రిని నేరాలు, మాదకద్రవ్యాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా పనిచేయాలని, ప్రజలకు వేగవంతమైన పోలీస్ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

# లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో 23 కిలోల గంజాయి స్వాధీనం



- **ఇద్దరు నిందితుల అరెస్టు ఒడిశా నుంచి నగరానికి అక్రమ రవాణా**

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. సుమారు 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితులు ముంబైకి చెందిన రహ్మతుల్లా ఖాన్, రషీద్‌లుగా పోలీసులు గుర్తించారు.ప్రాథమిక విచారణలో నిందితులు ఒడిశా నుంచి గంజాయిని సేకరించి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాన్ని అధికారులు సీజ్ చేసి, నిందితులను తదుపరి విచారణ కోసం శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ రవాణా వెనుక ఉన్న ఇతర వ్యక్తులు, ముఠా సభ్యుల పాత్రపై కూడా అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలి..



- **డీ ఈ ఓ కు వినతి..**

**హత్నూర, అక్టోబర్ 01,(సిరి న్యూస్)**

:మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ ప్రాథమిక ఉ న్నత పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్ ను రద్దు చేయాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ శ్రీహరి ఉప సర్పంచ్ శంకర్ లు గురువారం జిల్లా విద్యాధికారి రోహిణి నీ కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నీ యుపిఎస్ పాఠశాలలో ఇప్పటికే విద్యార్థులకు సబ్జెక్టులకు సరిపడ ఉపాధ్యాయుల లేక విద్యార్థులు అవస్థలు పడుతుంటే, ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేయడం సరైనది కాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇలా ఉపాధ్యాయులను తరచూ బదిలీ చేసుకుంటూ పోతే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. కావున ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్ వెంటనే రద్దు చేసి తిరిగి స్థానిక పాఠశాలలోనే ఉండేలా చూడాలని డీఈఓను కోరారు. వార్డు సభ్యులు జగన్ యాదవ్, సంతోషా రమేష్ లు డిఈ ఓ ను కలిసిన వారిలో ఉన్నారు.

# కిక్ బాక్సింగ్ మెడల్స్ ఆవిష్కరించిన జగ్గారెడ్డి



- **సంగారెడ్డిలో నేడు ఘనంగా 'ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్'**
- **యువత క్రీడా ప్రతిభను వెలికితీయడమే టోర్నమెంట్ ఉద్దేశం**

**సంగారెడ్డి, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

సంగారెడ్డి పట్టణంలోని చౌహాన్ ఫంక్షన్ హాల్‌లో నేడు నిర్వహించనున్న ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లు అన్నీ పూర్తి అయ్యాయి. ఈ చాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచే క్రీడాకారులకు అందజేయనున్న ఆకర్షణీయమైన మెడల్స్, ట్రోఫీలు, బహుమతులను గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిని క్రీడల వైపు ప్రోత్సహించాలనే సత్సంకల్పంతో ఈ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రదర్శన కనబరచనున్నట్లు తెలిపారు. ఈ బహుమతుల ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ ఎండీ సాజిద్, ప్రముఖ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ తదితరులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది..

- టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ఏకంగా 12,299 మెగావాట్ల గరిష్ట డిమాండ్
- 223.34 మిలియన్ యూనిట్ల విద్యుత్ పంపిణీ
- ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కట్టుబడి ఉన్నాం
- స్పష్టం చేసిన డిస్కమ్ సీఎండీ జితేష్ వి. పాటిల్

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ ఊహించని రీతిలో పెరుగుతోంది. నిన్నటితో పోలిస్తే నేడు ఎక్కువ అన్నట్లుగా ప్రతి రోజూ కొత్త ఆల్ టైమ్ రికార్డులు నమోదవుతున్నాయి. డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ సరఫరా చేయడం డిస్కమ్‌లకు ప్రస్తుతం కత్తి మీద సాములా మారుతోంది. బుధవారం తెలంగాణ రాష్ట్రం ఏకంగా 19,892 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను విజయవంతంగా తీర్చి మరో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. అదే రోజు కేవలం టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోనే 12,299 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదు కాగా.. 223.34 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పంపిణీ చేసి సంస్థ సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. 'తెలంగాణలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం మా ప్రధాన లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మార్గదర్శకత్వం, ఇంజినీర్లు, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషి వల్లనే ప్రతిరోజూ కొత్త రికార్డులు నమోదు అవుతున్నాయి. భవిష్యత్తులో మరింత అధిక డిమాండ్‌ను కూడా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల బలోపేతం, సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపు, నెట్‌వర్క్ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా కొనసాగిస్తున్నాం' అని తెలిపారు. ప్రతి రోజు నమోదవుతున్న కొత్త రికార్డు తెలంగాణ పారిశ్రామిక, వ్యవసాయాభివృద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతానికి డిస్కమ్‌లు ఎలాంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరాను విజయవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ.. ఇదే తీరులో డిమాండ్ పెరుగుదల కొనసాగితే రానున్న రోజుల్లో కోతల బాధలు తప్పవని విద్యుత్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తిలో ఎక్కువ భాగం సోలార్‌పైనే ఆధారపడటం, మరోవైపు హైడ్రల్, థర్మల్ ఉత్పత్తి క్రమంగా పడిపోతుండటం రానున్న కాలంలో కష్టాలకు ప్రధాన కారణం కావచ్చని హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, ప్రస్తుతం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా డిస్కమ్‌లు ఎప్పటికప్పుడు అప్రమత్తమై ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తుండటం అభినందనీయమైన పరిణామం.




# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

- ఈసీలో విభేదాలపై క్లారిటీ..
- 2025 ఫిబ్రవరి 19 నుంచి ఏ నిర్ణయంపైనా విభేదించలేదన్న ఈసీ వర్గాలు
- గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు గల్లంతు కావడానికి సాంకేతిక లోపమే కారణమని వివరణ
- సీఐఆర్‌పై రాజకీయ ఆరోపణల మధ్య దేశవ్యాప్తంగా నిరసనలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1:**

ఎన్నికల సంఘంలో ముగ్గురు కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయన్న వార్తల నేపథ్యంలో రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతున్న వేళ ఈసీ కీలక వివరణ ఇచ్చింది. 2025 ఫిబ్రవరి 19 నుంచి కమిషన్ తీసుకున్న ఏ నిర్ణయంపైనా ఏ ఎన్నికల కమిషనర్ విభేదించలేదని ఈసీ వర్గాలు గురువారం వెల్లడించాయి. ప్రతి నిర్ణయం "ఏకగ్రీవం"గానే తీసుకున్నట్లు పేర్కొన్నాయి. ప్రధానంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సీఐఆర్)లో మరణించిన, నకిలీ, మోసపూరిత, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లను గుర్తించడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో కొనసాగించడమే లక్ష్యమని స్పష్టం చేశాయి.

**14 అభ్యంతరాల కథనంతో కలకలం**

సీఐఆర్ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఈసీలు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అంగీకారంతోనే చర్యలు చేపట్టినట్లు ఈసీ వర్గాలు చెబుతున్నాయి. అయితే 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఇటీవల ప్రచురించిన పరిశోధనాత్మక కథనంలో.. గత 10 నెలల్లో సంధు, జోషి కనీసం 14 సార్లు పలు నిర్ణయాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెల్లడించింది. కొత్త ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు, ఓటర్ల పునరుద్ధరణ, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలపై వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు ఆ కథనం పేర్కొంది. అయితే ఈ కథనం వెలువడిన అనంతరం ఈసీ తన వైఖరిని స్పష్టం చేసింది. గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని పేర్కొంది. అదే సమయంలో కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం నిర్ణయ ప్రక్రియలో భాగమేనని ఈసీ వివరించింది.

**గోవా ఓట్లపై ఈసీ వివరణ**

గోవాలో 97 మంది అర్హులైన ఓటర్ల పేర్లు తుది జాబితాలో లేకపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. సీఐఆర్ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగానే ఈ పేర్లు తుది జాబితాలో చేరలేదని తెలిపింది. ఇదే అంశంపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం కూడా గోవా ఈఆర్‌ఓలు అర్హులుగా గుర్తించిన 97 మంది పేర్లను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయలేకపోయిన విషయాన్ని ప్రస్తావించింది.
దేశవ్యాప్తంగా 25 వేల మంది ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు సీఐఆర్ ప్రక్రియలో పనిచేస్తున్నారని ఈసీ వర్గాలు తెలిపాయి. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి ప్రక్రియలు కమిషనర్లు వ్యక్తిగతంగా నిర్వహించరని, క్షేత్రస్థాయిలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో వికేంద్రీకృతంగా జరుగుతాయని వివరించాయి.

**నిరసనలతో మరింత వేడెక్కిన రాజకీయం**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సీఐఆర్ పేరుతో బీజేపీకి అనుకూలంగా ఓట్ల తొలగింపు జరుగుతోందని కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సీఈసీపై చర్యలు కోరుతూ వివిధ ప్రాంతాల్లో నిరసనలు కూడా కొనసాగుతున్నాయి. మరోవైపు సీఐఆర్ ప్రక్రియపై సుప్రీంకోర్టులోనూ సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఈ ఆరోపణలను ఈసీ ఖండిస్తూ.. తన నిర్ణయ ప్రక్రియ ఏకగ్రీవంగానే సాగిందని చెబుతోంది. చట్టపరంగా కూడా ముగ్గురు సభ్యుల కమిషన్‌లో సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్లు సమాన హోదాలో ఉంటారు. 2023 చట్టంలోని నిబంధనల ప్రకారం సాధ్యమైనంతవరకు నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకోవాలి; భిన్నాభిప్రాయం ఉంటే మెజారిటీ అభిప్రాయం ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# రీల్ చూసి నకిలీ నోట్లు.. చివరకు జైలుకు!

- ఇన్‌స్టాగ్రామ్ రీల్‌తో నకిలీ కరెన్సీ తయారీకి ప్లాన్
- టెలిగ్రామ్‌లో శిక్షణ తీసుకుని ఇంట్లోనే ప్రింటింగ్
- కూరగాయల వ్యాపారి కిషన్ సోలంకిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.65,500 విలువైన నకిలీ నోట్లు, ప్రింటింగ్ సామగ్రి స్వాధీనం
- చిన్న కొనుగోళ్ల ద్వారా నకిలీ నోట్ల చలామణి

**రాజ్‌కోట్, అక్టోబర్ 1:**

ఇన్‌స్టాగ్రామ్‌లో చూసిన ఓ రీల్ ఓ కూరగాయల వ్యాపారిని నకిలీ కరెన్సీ తయారీకి పురిగొల్పింది. ఆ తర్వాత టెలిగ్రామ్ ద్వారా శిక్షణ తీసుకున్న అతడు ఇంట్లోనే నకిలీ రూ.100, రూ.500 నోట్లను ముద్రిస్తూ పోలీసులకు చిక్కాడు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఈ ఘటన వెలుగుచూసింది. మాందదుంగర్ ప్రాంతానికి చెందిన కిషన్ సోలంకిని రాజ్‌కోట్ సిటీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ పోలీసులు అరెస్ట్ చేశారు.

**రీల్ నుంచి టెలిగ్రామ్ వరకు**

కూరగాయల వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయం సరిపోక అప్పుల్లో కూరుకుపోయిన కిషన్.. నకిలీ నోట్లు తయారు చేసే విధానంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్ చూశాడు. ఆ రీల్‌కు సంబంధించిన వ్యక్తిని సంప్రదించగా.. టెలిగ్రామ్ ద్వారా నకిలీ కరెన్సీ తయారీపై శిక్షణ పొందాడు. అనంతరం ఇంట్లోనే నకిలీ నోట్ల ముద్రణ ప్రారంభించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.
తాను తయారు చేసిన రూ.10 వేల విలువైన నకిలీ నోట్లను శిక్షణ ఇచ్చిన వ్యక్తికి ఇచ్చినట్లు, అందుకు ప్రతిగా రూ.3 వేలు చెల్లించినట్లు కిషన్ పోలీసులకు తెలిపాడు. శిక్షణ ఇచ్చిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



**చిన్న కొనుగోళ్లతో చలామణి**

కిషన్ ఇంట్లో తనిఖీలు నిర్వహించిన పోలీసులు సీపీయూ, మానిటర్, రెండు ప్రింటర్లు, లామినేటర్ హీటర్ మెషిన్, బటర్ పేపర్, రూ.100 డినామినేషన్ ముద్రించిన కాగితాలను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ కరెన్సీతో కలిపి స్వాధీనం చేసుకున్న సామగ్రి విలువ రూ.65,500గా పోలీసులు అంచనా వేశారు.
నకిలీ నోట్లను బల్క్‌గా విక్రయించకుండా వివిధ ప్రాంతాల్లో చిన్నచిన్న కొనుగోళ్లు చేస్తూ స్వయంగా చలామణి చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటివరకు ఎంత మొత్తంలో నోట్లు ముద్రించాడు, ఎక్కడెక్కడ చలామణి చేశాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసులో కిషన్ సోలంకికి కోర్టు మూడు రోజుల రిమాండ్ విధించింది.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే: అభిజిత్ దీప్కే

- అనుమతి లేకపోయినా అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో 'జైల్ భరో' నిర్వహిస్తాం
- "మూడు రోజులు కాదు.. మూడు నెలలైనా జైలుకు వెళ్లేందుకు సిద్ధం"
- సీఈసీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్
- 2025 ఓటర్ల జాబితాను ఫ్రీజ్ చేసి ఎలాంటి మార్పులు చేయొద్దని కోరిన సీజేపీ
- అక్టోబర్ నెలాఖరు నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు హెచ్చరిక

**ముంబై, అక్టోబర్ 1:**

"ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు మా ఆందోళన ఆగదు" అని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజిత్ దీప్కే స్పష్టం చేశారు. అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్‌లో నిరసనకు పోలీసుల అనుమతి లేకపోయినా వెనక్కి తగ్గబోమని చెప్పారు. 'జైల్ భరో ఆందోళన్' నిర్వహించి దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు. ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయాలను పలు జాతీయ మీడియా సంస్థలు అక్టోబర్ 1న వెల్లడించాయి.

**"మూడు రోజులు కాదు.. మూడు నెలలైనా"**

నిరసనకారులకు మూడు రోజుల పాటు బెయిల్ దొరకదని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలను దీప్కే ప్రస్తావించారు. ప్రభుత్వం తమను జైలులో ఉంచాలని భావించినా మూడు రోజులు కాదు.. మూడు నెలలైనా జైలు శిక్ష ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ముంబై పోలీసులు ఢిల్లీ పోలీసులు కాదని, పరిస్థితిని వారు సమర్థంగా నిర్వహిస్తారన్న నమ్మకం తమకు ఉందని పేర్కొన్నారు. శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న ఆందోళన నిర్వహించేందుకు ముంబై పోలీసులు అనుమతి నిరాకరించిన విషయం ఇప్పటికే వెల్లడైంది.

**సీఈసీ నియామకంలో పారదర్శకత ఉండాలి**

జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో పాటు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని దీప్కే డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, అందులో పౌర సమాజానికి కూడా భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేసి, 2025 నాటి ఓటర్ల జాబితాను ఫ్రీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ జాబితాలో ఇకపై ఎలాంటి మార్పులు చేయొద్దని కోరారు.



**అక్టోబర్ నెలాఖరు నుంచి ఢిల్లీలో ఆందోళన**

తమ డిమాండ్లు నెరవేరకపోతే అక్టోబర్ నెలాఖరు నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపడతామని దీప్కే ప్రకటించారు. అక్టోబర్ 2న ముంబై నుంచి ప్రారంభమయ్యే నిరసనలను ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తామని సీజేపీ ఇప్పటికే ప్రకటించింది.

# సివిల్ సర్వీసు లక్ష్యం ప్రజాసేవే: ప్రధాని మోదీ

- ప్రతి ఉద్యోగికి 'నాగరిక్ దేవోభవ' నినాదం కావాలి
- పేదల ఆవేదనను అర్థం చేసుకునే మనసు అవసరం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 01:**

దేశ ప్రజలకు సేవ చేయడమే సివిల్ సర్వీసు ఉద్యోగుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సిటిజన్ ఫస్ట్ అనే భావనతో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పనిచేయాలని, 'నాగరిక్ దేవోభవ' అనే ఆలోచనను తమ విధుల్లో ఆచరణలో పెట్టాలని సూచించారు. యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సివిల్ సర్వీసు వ్యవస్థ భవిష్యత్తు దిశపై పలు కీలక సూచనలు చేశారు. దేశంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకొని అధికారులు కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండాలని ప్రధాని అన్నారు. నగరాల విస్తరణ, మౌలిక సదుపాయాల అవసరాలు, పెరుగుతున్న జనాభా ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ఆధారిత విధానాలను ప్రభుత్వ పాలనలో మరింతగా ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్ సర్వీసు ఎంపిక విధానాన్ని కాలానుగుణంగా ఆధునీకరించాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. ఉద్యోగుల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు స్వీయ మూల్యాంకన విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు కేవలం విధుల నిర్వహణకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కార మార్గాలను అన్వేషించాలని ఆయన అన్నారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే ప్రభుత్వ వ్యవస్థలో పనిచేసే ప్రతి ఒక్కరికి సున్నితమైన దృక్పథం అవసరమని ప్రధాని చెప్పారు. సామాన్య ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను అర్థం చేసుకొని సేవా భావంతో పనిచేసే అధికారులు దేశాభివృద్ధికి బలమైన పునాది అవుతారని అభిప్రాయపడ్డారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇవ్వాలంటే ఉద్యోగుల అంకితభావం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లోనూ అపారమైన సమయస్ఫూర్తి, సహనం ప్రదర్శించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడారని కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం దేశ ప్రజలందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.



కెప్టెన్ స్మిత్ మచ్చర్ కుటుంబ సభ్యులతో తాను మాట్లాడినట్లు ప్రధాని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారని, త్వరగా కోలుకోవాలని దేశ ప్రజలంతా ప్రార్థించాలని కోరారు. దేశానికి కీర్తి తెచ్చిన స్మిత్ మచ్చర్ సేవలను ప్రతి భారతీయుడు గుర్తుంచుకోవాలని, ఆయనకు వందనం చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.






# రక్షణ ఆర్థిక నిర్వహణలో సాంకేతికతకు పెద్దపీట

**న్యూఢిల్లీ, అక్టోబర్ 01:**

రక్షణ ఖాతాల విభాగం వార్షిక సమీక్షలకే పరిమితం కాకుండా ఎప్పటికప్పుడు ఆర్థిక పరిస్థితులను సమీక్షించే విధానాన్ని అవలంబించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. నిర్ణయాలు తీసుకునే ఉన్నతాధికారులకు కీలక సమాచారం సకాలంలో చేరేందుకు సమాచార నిర్వహణ వ్యవస్థల వివరాలను తక్షణంగా నవీకరించే విధానం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన రక్షణ ఖాతాల విభాగం దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ దేశ రక్షణ రంగంలో ఆర్థిక నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉండాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ, యంత్ర అభ్యాసం, డిజిటల్ లావాదేవీ భద్రతా వ్యవస్థలు, సమాచార విశ్లేషణ వంటి సాంకేతిక సాధనాల వినియోగం ద్వారా పారదర్శకత, వేగం, భద్రతను పెంచవచ్చని పేర్కొన్నారు. రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయం ప్రకారం ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం ప్రస్తుత కాలంలో అత్యంత అవసరమైంది. వివిధ విభాగాల నుంచి వచ్చే
వివరాలు తక్షణం అందుబాటులో ఉండటం వల్ల విధానపరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం డిజిటల్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రక్షణ ఖాతాల విభాగం దేశ రక్షణ వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తోందని మంత్రి పేర్కొన్నారు. సైనిక అవసరాలకు అనుగుణంగా నిధుల వినియోగం, వ్యయ నియంత్రణ, ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాల్లో ఈ విభాగం పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా ఈ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని తెలిపారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ పారదర్శక ఆర్థిక వ్యవస్థలు దేశ భద్రతకు కూడా పరోక్షంగా బలం చేకూరుస్తాయని అన్నారు. డిజిటల్ సాంకేతికత ఆధారంగా సమాచార భద్రతను పెంచడం ద్వారా ఆర్థిక లావాదేవీలలో నమ్మకాన్ని పెంపొందించవచ్చని వివరించారు.

**The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.**